నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శనివారం 18 జనవరి 2025 YADADRI BHUVANAGIRI


## ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నాయకుల కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శంకరాచారి, నాయకులు

సంస్థాన్ నారాయణపురం, జనవరి 17 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బీఆర్ఎస్ మండల నాయకులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపై ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ధర్నా విజయవంతం కావడంతో బీసీ సమాజం తరపున ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితతో తెలంగాణ సమాజం బాసటగా నిలబడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అందోజు శంకరాచారి అన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు పద్మ, ఎలిజబెత్, నాగేంద్రబాబు, రాణి, సంతోష్ ఉన్నారు.

# రేషన్ కార్డులకు కొత్త కొర్రీ

### కులగణన సర్వేను ప్రామాణికం తీసుకుంటున్న ప్రభుత్వం

- ప్రజాపాలన దరఖాస్తులు పక్కకు..
- జిల్లాలో 27,573 మందికే కొత్త కార్డులు
- కుల గణన సర్వేలో రేషన్ కార్డు లేదన్న వారినే పరిగణనలోకి

నల్లగొండ, జనవరి 17 : రిజర్వేషన్ల కోసమే కుల గణన సర్వే అంటూ పదుల సంఖ్యలో కాలమ్స్ పెట్టి సమాచారం స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం దాన్నే ప్రామాణికంగా పథకాల అమలుకు సిద్ధమవుతున్నది. బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఈ సర్వేను పెద్దగా పట్టించుకోలేదు. సర్వేకు వచ్చిన వారు సైతం పక్కింటి వాళ్లను అడిగి అందిన సమాచారం మేరకు వివరాలు రాసుకుని వెళ్లారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో ప్రజా పాలన పేరుతో స్వీకరించిన దరఖాస్తులను పక్కన పెట్టి.. తాజా సర్వే సమాచారాన్ని ప్రామాణికంగా తీసుకుంటున్నది. అలా జిల్లాలో 27,573 మంది మాత్రమే రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నట్లు రికార్డుల్లో నమోదైంది. దాని ఆధారంగానే జిల్లాలో గురువారం నుంచి ఈ నెల 20 వరకు క్షేత్రస్థాయి సర్వే చేపడుతున్నారు. 21న లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేయనున్నారు.

**ప్రభుత్వం నుంచే జాబితా..**

గతంలో రేషన్ కార్డుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారణ జరిపి అర్హతను నిర్ణయించిన తర్వాత సర్కారు మంజూరు చేసేది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ బహిరంగంగా ప్రకటిస్తే జాబితా పెరుగుతుందన్న భయంతో దొడ్డిదారిని ఎంచుకుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుల గణన పేరుతో గత నవంబర్‌లో చేపట్టిన సర్వేలోనే పలు అంశాలను అడిగారు. ఆ సమయంలో స్థానికంగా లేని వారి నుంచి పూర్తి సమాచారం రాలేదు.

ప్రజా పాలనలో రేషన్ కార్డుకు దరఖాస్తులు చేశాం అనుకుని కుల గణన సర్వే సమయంలో అందుబాటులో లేనివాళ్లు ఇప్పుడు కార్డు కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. కుల గణన సర్వేలో జిల్లా వ్యాప్తంగా 27,573 మంది తమకు రేషన్ కార్డులు లేవని చెప్పగా, ఆ జాబితా ప్రభుత్వం నుంచి తిరిగి జిల్లా యంత్రానికి చేరింది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఫైనల్ చేసే యోచనలో అధికారులు ఉన్నారు.

### కుల గణన ఆధారంగా తయారీ జాబితా

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ : ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కుల గణన సర్వేలో రేషన్ కార్డు లేని వారి జాబితాను రాష్ట్రస్థాయిలోనే తయారుచేసినట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఆ జాబితాను మండలాలు, మున్సిపాలిటీలకు పంపినట్లు వెల్లడించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లు ఈ నెల 16 నుంచి 21వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 21న ముసాయిదా జాబితాను గ్రామ సభలో ఆమోదించిన తర్వాత జాబితాను మండల, మున్సిపల్ లాగిన్ల ద్వారా కలెక్టర్‌కు, ఆ తర్వాత పౌర సరఫరాల కమిషనర్‌కు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం అర్హులకు రేషన్ కార్డులు అందుతాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# 21న బీఆర్ఎస్ రైతు మహాధర్నా





### నల్లగొండలో పెద్దఎత్తున నిరసన

### హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నల్లగొండ ప్రతినిధి, జనవరి17(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతో పాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా మోసాలపై బీఆర్ఎస్ పార్టీ మహా ధర్నాకు సిద్ధమవుతున్నది. ఈ నెల 21న నల్లగొండ నడిబొడ్డున క్లాక్‌టవర్ సెంటర్ వేదికగా నిరసన తెలుపనున్నది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇదే విషయాన్ని శుక్రవారం షాబాద్ రైతు ధర్నా వేదిక నుంచి కేటీఆర్ స్వయంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ నెల 12న రాష్ట్రంలోనే తొలి మహా ధర్నా నల్లగొండలో జరుగాల్సి ఉంది. ఏర్పాట్లు సైతం పూర్తికావచ్చిన దశలో సంక్రాంతి ప్రయాణాలు, హైవేలపై వాహనాల రద్దీ, పండుగ వాతావరణం నేపథ్యంలో పోలీసుల విజ్ఞప్తి మేరకు బీఆర్ఎస్ నేతలు వాయిదా వేశారు. అదే రోజున 21న మహాధర్నా ఉంటుందని కూడా పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి జిల్లా నేతలకు సమాచారం అందింది. షాబాద్ మండల కేంద్రంలో జరిగిన మహాధర్నా నుంచి కేటీఆర్ అధికారికంగా నల్లగొండ ధర్నా గురించి ప్రకటించారు. 'రైతుల తరపున పోరాటానికి ఇది ఆరంభం మాత్రమే. 21న తారీఖు నాడు నల్లగొండలో మళ్లొక రైతు ధర్నా ఉంటది. ఆ తర్వాత వివిధ జిల్లాలకు ఈ కార్యక్రమాన్ని తీసుకుపోతం. రైతులకు న్యాయం జరిగే వరకు కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడుతూనే ఉంటం. ఎన్ని కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా మీ కోసం కొట్లాడుతూనే ఉంటం' అని ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడారురు. దాంతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలంతా నల్లగొండ రైతు మహాధర్నాపై దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతులను సమీకరించి నిరసన తెలుపాలని నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై రైతుల పక్షాన సర్కారుకు హెచ్చరిక పంపాలని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఇప్పటికే రుణమాఫీ మోసం, రైతుభరోసా కుదింపు కుట్రలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొద్దిరోజుల నుంచి ఆగ్రహంతో రోడ్లపైకి వస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్న రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు మహాధర్నాకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆ మేరకు ధర్నా స్థలంలో అవసరమైన ఏర్పాట్లు చేయడంలో పార్టీ నేతలు నిమగ్నమయ్యారు.

# నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు..
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- ఉమ్మడి జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు.. 4,547మంది విద్యార్థులు

రామగిరి, జనవరి 17: జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష శనివారం నిర్వహించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 4,547 మంది పరీక్ష రాయనున్నారు. ఇందులో 2,561 మంది బాలురు, 1,986 మంది బాలికలున్నారు. నల్లగొండ జిల్లాలో 13 పరీక్ష కేంద్రాల్లో 2,329 మంది విద్యార్థులు.. సూర్యాపేట జిల్లాలో 9 పరీక్ష కేంద్రాల్లో 1525మంది విద్యార్థులు.. యాదాద్రిభువనగిరి జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో 693 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30వరకు జరుగనున్నది. నిర్ణీత సమయానికి కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని అధికారులు స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది.

**ఇవి తప్పనిసరి**

- ప్రతి విద్యార్థి హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు)తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.
- బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను తీసుకురావచ్చు.
- ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదు.
- విద్యార్థులకు ఇచ్చే ఓఎంఆర్‌ను పెన్నుతో మాత్రమే నింపాలి.

## నేడు పెన్నా సిమెంట్ కర్మాగారంలో ప్రజాభిప్రాయ సేకరణ

దామరచర్ల, జనవరి17 : మండలంలోని గణేశ్‌పహాడ్‌లో ఏర్పాటు చేసిన పెన్నా సిమెంట్ కర్మాగారంలో ఉత్పత్తి సామర్థ్యం పెంచుకొనేందుకు ఈ నెల 18న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. పెన్నా సిమెంట్ కంపెనీని ఇటీవల అదానీ గ్రూప్ సంస్థ కొనుగోలు చేసి పేరును అంబుజాగా మార్చుకొంది. కర్మాగారానికి చెందిన మైనింగ్ లీజు గడువు ముగియడంతో గతంలో ఉన్న 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని 1.8 మిలియన్ టన్నులకు పెంచుకొనేందుకు మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసుకున్నది. ఈ క్రమంలో మైనింగ్ అధికారులు గతంలో రెండు సార్లు ప్రజాభిప్రాయ సేకరణకు చర్యలు చేపట్టగా కొన్ని పరిస్థితుల ప్రభావం కారణంగా వాయిదా వేశారు. ఈ నెల 18న తిరిగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు.

స్థానికంగా ప్రభావిత గ్రామాలైన శూన్యపాడ్, గణేశ్‌పహాడ్ గ్రామస్తులు గతంలో కంపెనీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆందోళనలు, నిరసనలు లేకుండా పరిశ్రమ యాజమాన్యం బుజ్జగింపు చర్యలు చేపట్టింది.



నల్లగొండ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

# బస్టాండ్లు కిటకిట

### పండుగ సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణం

- ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు వసూలు
- ఉమ్మడి జిల్లాలో 640 బస్సులకు 398 స్పెషల్ బస్సులే..
- సరిపడా బస్సులు లేక మహిళా ప్రయాణికుల అవస్థలు

నల్లగొండ సిటీ, జనవరి 17 : సంక్రాంతికి గ్రామాలకు వచ్చిన ప్రజలు పండుగ సెలవులు ముగియడంతో పట్టణాలకు తిరుగు ముఖం పడుతున్నారు. స్కూళ్ల సెలవులు ముగియడంతోపాటు ఉద్యోగాలు, వ్యాపారులు చేసే వారు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తుండడంతో బస్టాండ్లు రద్దీగా మారాయి. ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌కు నడిపే బస్సులను స్పెషల్ పేరిట 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు చేసేదేమీ లేక ఎలాగైనా గమ్యం చేరాలనే ఉద్దేశంతో వెళ్లాల్సి వస్తున్నది. ఇదేమి దోపిడీ అని కొంత మంది ప్రయాణికులు అడిగితే స్పెషల్ బస్సులు అని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

**కానరాని ఉచిత బస్సులు**

ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల్లో 640 బస్సులు ఉండగా వాటిలో 398 బస్సులను అదనపు బస్సుల పేరిట చార్జీలు పెంచి నడుపుతున్నారు. ఈ నెల 9నుంచి 13 వరకు ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల నుంచి 398 స్పెషల్ బస్సులను నడిపించారు. తిరిగి ఈ నెల 15 నుంచి 20 వరకు 370 బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉచిత బస్సులు అయిన ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగును కూడా స్పెషల్ బస్సులుగా మార్చారు. దాంతో సరిపడా బస్సులు లేక పోవడంతో మహిళలకు ఉచిత ప్రయాణం లేకుండా పోయింది. డీలక్స్, సూపర్ లగ్జరీ, స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉచిత బస్సులు గంటకొకటి వచ్చినా కిక్కిరిసి వస్తుండడంతో పిల్లలు, వృద్ధులతో ప్రయాణించడం గగనంగా మారింది. నల్లగొండ, మిర్యాలగూడ నుంచి అత్యధికంగా హైదరాబాద్‌కు వెళ్తుండడంతో అక్కడి నుంచి స్పెషల్ బస్సులను ఎక్కువగా నడిపిస్తున్నారు.

## డ్రోన్ సహాయంతో టీబీ రోగుల శాంపిళ్ల తరలింపు

### గట్టు సింగారం నుంచి రామన్నపేట దవాఖానకు పంపిన వైద్యులు



గట్టుసింగారం నుంచి రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు డ్రోన్ సహాయంతో శాంపిళ్లను పంపిస్తున్న వైద్యులు

అడ్డగూడూరు, జనవరి 17 : మండలంలోని గట్టుసింగారంలో శుక్రవారం టీబీ రోగుల నుంచి శాంపిళ్లను సేకరించి రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు డ్రోన్ సహాయంతో పంపినట్లు మండల వైద్యాధికారి భరత్‌కుమార్ తెలిపారు. అడ్డగూడూరు నుంచి రామన్నపేటకు 53 కిలోమీటర్ల దూరం ఉంటుందని, వాహనంతో పంపిస్తే ఒక గంట 20 నిమిషాలు పడుతుందని, అదే డ్రోన్‌తో 30 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని ఆయన చెప్పారు. గ్రామంలో 11 మంది శాంపిళ్లను సేకరించి పంపినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో రోగుల, అనుమానితుల నుంచి రక్త పరీక్షలకు నమునాలను సేకరించి ల్యాబ్‌లకు పంపించి తిరిగి రోగులకు అవసరమైన మందులను పంపేందుకు డ్రోన్ సేవలు ఉపయోగపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సు శారద, సూపర్‌వైజర్ సరోజన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# పరిహారం.. పరిహాసం

### బస్వాపూర్ రిజర్వాయర్‌కు నిధుల కొరత

కరువు నేలపై జల సిరులు పారించేందుకు ఉద్దేశించిన బస్వాపూర్ రిజర్వాయర్‌ను నిధుల కొరత వెంటాడుతున్నది. చివరి దశలో ఉన్న నిర్మాణ పనులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి కాంగ్రెస్ సర్కారులో మోక్షం కలుగడం లేదు. అరకొరగా విడుదలైన నిధులు రెండు నెలల నుంచి కలెక్టర్ ఖాతాలోనే మూలుగుతున్నాయి. అత్యవసరంగా మరో రూ.60 కోట్లు విడుదల చేస్తేనే పనులు ముందుకు సాగుతాయని అధికారులు చెబుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని మిగతా నిధులు విడుదల చేయించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, జనవరి 17 (నమస్తే తెలంగాణ)

## ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి దక్కని మోక్షం

- అత్యవసరంగా రూ.110 కోట్లుంటేనే పనులు
- రెండు నెలల క్రితమే రూ.50 కోట్లు విడుదల
- ఎవరికి ఇవ్వాలో అర్థం కాక పెండింగ్‌లో పెట్టిన అధికారులు
- కలెక్టర్ ఖాతాలో మూలుగుతున్న ఫండ్స్
- మరో రూ.60కోట్లు వస్తేనే పునరావాసానికి చర్యలు
- ఆశగా ఎదురుచూస్తున్న నిర్వాసితులు

కాళేశ్వరం ప్రాజెక్టు 16వ ప్యాకేజీలో భాగంగా 11.39టీఎంసీల సామర్థ్యంతో జిల్లాలోని భువనగిరి మండలంలో బస్వాపూర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1652.26 కోట్లు కేటాయించింది. ఇప్పటివరకు రూ.1,250 కోట్ల మేర పనులు పూర్తయ్యాయి. మొత్తం జలాశయం, ఎగువ, దిగువ కాల్వలు నిర్మించేందుకు 5,891 ఎకరాల భూసేకరణ చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయి. తొలి దశలో ఒక టీఎంసీతో నింపి రైతులకు సాగు నీరు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అధికార మార్పుతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక నృసింహసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భువనగిరి మండలంలోని బీఎన్ తిమ్మాపూర్, యాదగిరిగుట్ట మండలంలోని లప్పానాయక్‌తండా, తుర్కపల్లి మండలంలోని చోక్లానాయక్ తండాలు పూర్తిగా మునిగిపోనున్నాయి. బీఎన్ తిమ్మాపూర్ గ్రామంలో మొత్తం 585 ఇండ్లు ఉండగా, సగం మందికి పరిహారం అందించారు. ఇంకా సగం మందికి పరిహారం అందాల్సి ఉంది. చొక్లానాయక్ తండావాసులకు పునరావాసం కల్పించాల్సి ఉంది. పరిహారం చెల్లిస్తేనే ఆయా గ్రామాలను పూర్తిగా తరలించాల్సి ఉంటుంది. గ్రామాల తరలింపు ఆలస్యమవడంతో రిజర్వాయర్ నిర్మాణ పనులు తుది దశకు వచ్చినా నిరుపయోగంగానే మారినట్లయ్యింది.

**పూర్తయితే లక్షల ఎకరాలకు కాళేశ్వరం జలాలు..**

నృసింహసాగర్ రిజర్వాయర్‌తో యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని పలు మండలాలకు సాగు, తాగు నీరు అందుతుంది. ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే 2.5లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజవర్గాలతోపాటు మోత్కూరు, నల్లగొండ జిల్లాలోని రామన్నపేట, చిట్యాల, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. గతంలో నృసింహసాగర్ రిజర్వాయర్‌ను పర్యాటకంగా కూడా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలు కూడా ఉన్నాయి.



బస్వాపూర్ రిజర్వాయర్

### కలెక్టర్ ఖాతాలో రూ.50కోట్లు..

ప్రస్తుతం ప్రాజెక్ట్ కోసం సుమారు రూ.500 కోట్లు అవసరం ఉన్నట్లు అంచనా. ఇందులో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం రూ.250 కోట్లు, భూసేకరణకు రూ.250 కోట్ల వరకు నిధులు కావాలి. నవంబర్‌లో రూ.50 కోట్లు విడుదల చేస్తూ జీఓ జారీ చేశారు. ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ గ్రామస్తులకు పునరావాసం, పునర్నిర్మాణం కింద భువనగిరి పరిధిలోని హుస్సేనాబాద్‌లో సర్వే నంబర్ 107లో సుమారు 75 ఎకరాల్లో ఇండ్ల స్థలాలను కేటాయించారు. అక్కడే 822 గ్రామస్తులకు ప్లాట్లు ఇచ్చారు. కొన్ని నిర్మాణాలు ప్రారంభించారు. తిమ్మాపూర్ గ్రామస్తులకు ఇండ్లు, ఇతర నిర్మాణాలు, చెట్లు, పశువులకు పరిహారం చెల్లించలేదు. ఇక్కడ పునరావాసం కింద రూ.110 కోట్ల వరకు అవసరం. కాగా, ప్రభుత్వం రూ.50 కోట్లు మాత్రమే విడుదల చేయడంతో ఏం చేయాలో అర్థంకాక అధికారులు డైలమాలో పడ్డారు. ఆ కొంత డబ్బు ఎవరికి ఇచ్చినా ఇబ్బందులు తలెత్తుతాయనే భావనకు వచ్చారు. దాంతో విడుదలైన నిధులను ఎవరికీ ఇవ్వకుండా కలెక్టర్ ఖాతాలోనే ఉంచారు. దాదాపు రెండు నెలలుగా అలాగే ఉన్నాయి. మరో రూ.60 కోట్లు వస్తే తప్ప వాటిని తీసే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు పరిహారం కోసం నిర్వాసితులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు.

### పరిహారం వెంటనే చెల్లించాలి



బస్వాపూర్ ప్రాజెక్టులో సర్వం కోల్పోయాం. ఇల్లు, పంట పొలాలు అన్నీ ప్రాజెక్టులో మునిగిపోతున్నాయి. 2007 నుంచి ఇప్పటి వరకు ముంపు గ్రామానికి పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. ఏండ్ల నుంచి శిథిలావస్థకు చేరిన ఇండ్లల్లోనే దుర్భర జీవితాలను అనుభవించాల్సి వస్తున్నది. పునరావాసంలో భాగంగా భువనగిరి పట్టణ పరిధిలో ఇంటి నివాస స్థలాలు అందించారు. కానీ వాటిలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్థిక స్థోమత లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ ప్రాంత ప్రజలు, రైతులకు సాగు, తాగునీటి కోసం మా గ్రామం పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. తక్షణమే పరిహారం అందించాలి.

**-ఉడుత శారదాంజనేయులు, మాజీ ఎంపీటీసీ**